క్లుప్తంగా

పేదలకు వరం ఆరోగ్య శ్రీ



సమాచారం తెలుసుకుంటున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ కాంతారావు నాయక్

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజలందరికీ ఆరోగ్యశ్రీ వరమని, ఆరోగ్యశ్రీ కార్డు అందరికీ ఉండేలా అధికారులు చూడాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ కాంతారావు నాయక్ సూచించారు. సోమవారం మండల కేంద్రమైన కొత్తపల్లి ప్రభుత్వ వైద్యశాల పరిధిలో జరుగుతున్న ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ప్రతి కుటుంబానికి సంవత్సరానికి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దీపా నాగవేణి, బాలకృష్ణ, వైద్య సిబ్బంది ఉన్నారు.

పబ్లిక్ పరీక్షల పట్ల ఆందోళన వద్దు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల పట్ల ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలని కాంకర్ ఒకేషనల్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ వేణుగోపాల్ అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి, ముసలిమడుగు, గోకవరం ప్రభుత్వ, కేజీబీవీ పాఠశాలల్లో ఈనెల 5న ప్రజ్ఞ వికాస పరీక్షలు రాసి ప్రతిభ చూపిన పదో తరగతి విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కే దినేష్ ఆధ్వర్యంలో బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రేమ్ కుమార్, సాయి, దిలీప్, గంగాధర్, లింగేష్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరు: పట్టణంలోని కోర్టులో మార్చి 9న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక కోర్టులో సోమవారం లోక్‌అదాలత్‌పై పోలీసులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజీ అయ్యే అన్ని కేసులను, క్రిమినల్, చెక్‌బౌన్స్, 10లీటర్ల లోపు నాటుసారా కేసులు పరిష్కరిస్తామని చెప్పారు. కక్షిదారులతో పోలీసులు మాట్లాడి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐలు నాగభూషణ్‌యాదవ్, లక్ష్మీనారాయణ, ఎస్‌ఐలు అశోక్‌కుమార్, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

పగిడ్యాల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కబడ్డీ క్రీడాకారులకు పూర్వ విద్యార్థి చంద్రశేఖర్ సోమవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. తండ్రి ప్రసాదరావు జ్ఞాపకార్థం చంద్రశేఖర్ క్రీడాదుస్తులను పంపిణీ చేయడం అభినందనీయమని హెచ్‌ఎం మధుసుధన్‌రావు అన్నారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రషీద్‌మియ్య, సుదర్శన్ రెడ్డి, పీతాంబర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో సున్నావడ్డీ అర్హుల జాబితా



ఆర్‌బీకే వద్ద సున్నావడ్డీ జాబితాను పరిశీలిస్తున్న రైతులు

ఆత్మకూరు: పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 28న సున్నావడ్డీ నిధులను జమ చేయనున్నారు. ఈ మేరకు పథకానికి అర్హులైన రైతుల జాబితాను సోమవారం వ్యవసాయాధికారులు విడుదల చేశారు. స్థానిక ఆర్బీకేలో ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, రైతు భరోసా కేంద్రం చైర్మన్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సున్నావడ్డీ పథకం కింద రైతులు ఖరీఫ్, రబీ పంటల్లో తీసుకున్న రుణాలకు వడ్డీలు చెల్లిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వీఏఏలు లత, రవిగౌడ్, శివశంకర్‌నాయక్, సావిత్రిబాయి పాల్గొన్నారు.

వాహనాలు నిలిచేలా.. భక్తులు మెచ్చేలా

- మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీశైలంలో ప్రత్యేక ఏర్పాట్లు
- క్షేత్ర పరిధిలో 25 ఎకరాల్లో పార్కింగ్
- ఏపీ, తెలంగాణ, కర్ణాటక ఆర్టీసీ బస్సులకు ప్రత్యేక బస్టాండులు
- పార్కింగ్ ప్రదేశాల్లో తాగునీరు, విద్యుత్ లైట్లు, శౌచాలయాలు, భారీషెడ్డు ఏర్పాటు
- ఆలయం వద్దకు భక్తులకు ఉచిత బస్సు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 1 నుంచి 11వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలానికి వాహనాల్లో తరలివచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా క్షేత్ర పరిధిలో సువిశాలమైన ప్రదేశాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో క్షేత్ర పరిధిలోని వివిధ ప్రదేశాలలో మొత్తం 25 ఎకరాలు పార్కింగ్‌కు కేటాయించారు. గతేడాది కంటే అదనంగా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. పార్కింగ్ ప్రదేశాల్లో శాశ్వతంగా హైమాక్స్ లైట్లు, తాగునీటి ట్యాంకులు, శౌచాలయాలు ఏర్పాటు చేశారు. అలాగే వాహనదారులు సేద తీరేందుకు భారీ షెడ్లు నిర్మించారు.

24 ఎకరాల్లో కార్ల పార్కింగ్

హెలిప్యాడ్ ఏరియా, వాసవి విహార్, ఆగమ పాఠశాల ఎదురు, ఆర్టీసీ బస్టాండ్ పక్కన, యజ్ఞవాటిక, విభూతిమఠం, ఫిల్టర్‌బెడ్ ఏరియా, గణేశ సదనం వెనుకభాగం, మల్లమ్మ కన్నీరు మందిరం, గురుసదనం ఎదురు తదితర ఏరియాల్లో పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. కార్ల పార్కింగ్ కోసం క్షేత్ర పరిధిలోని వివిధ చోట్ల మొత్తం 24 ఎకరాలను పార్కింగ్ కోసం కేటాయించారు. ఆయా ప్రదేశాలలో మొత్తం 4,850 వాహనాలు పార్క్ చేసుకునేందుకు వీలు ఉంటుంది.

14 ఎకరాల్లో ఆర్టీసీ బస్టాండులు

బ్రహ్మోత్సవాలకు మన రాష్ట్రం నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఆర్టీసీ బస్సులలో కూడా భక్తులు తరలివస్తారు. ఏపీ ఆర్టీసీ బస్సులకు ఔటర్ రింగ్‌రోడ్డు పక్కన 7ఎకరాల్లో బస్టాండు ఏర్పాటు చేశారు. అలాగే తెంగాణ ఆర్టీసీ బస్సులకు 3ఎకరాలు, కర్ణాటక ఆర్టీసీ బస్సులకు 4 ఎకరాల్లో పార్కింగ్ సౌకర్యం కల్పించారు. మొత్తం 14 ఎకరాల్లో ఏపీ, తెలంగాణ, కర్ణాటకకు చెందిన 4,640 బస్సులు నిలుపుకునే అవకాశం ఉంది.

పార్కింగ్ ప్రదేశాల్లో విస్తృత ఏర్పాట్లు

కార్లు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ బస్సులు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ ప్రదేశాలలో వాహనదారుల సౌకర్యార్థం దేవస్థానం విస్తృత ఏర్పాట్లు కల్పిస్తుంది. ఆయా పార్కింగ్ ప్రదేశాల్లో తాగునీరు, వాహనదారులు సేద తీరేందుకు భారీ షెడ్లు, శౌచాలయాలు, స్నానాలు ఆచరించేందుకు షవర్‌బాత్‌లు ఏర్పాటు చేశారు. తాత్కాలిక శౌచాలయాలతో పాటు వివిధ ప్రదేశాల్లో శాశ్వత ప్రాతిపదికన శౌచాలయాలు, స్నానపు గదులను నిర్మించారు. అలాగే శాశ్వత ప్రాతిపదికన పార్కింగ్ ప్రదేశాలో హైమాక్స్ విద్యుత్‌లైట్లను బిగించారు.



కార్లు పార్క్ చేసుకునేందుకు ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశం




కర్ణాటక రాష్ట్ర ఆర్టీసీ బస్సుల పార్కింగ్ స్థలం

పార్కింగ్ ప్రదేశాల నుంచి ఆలయం వద్దకు భక్తులకు ఉచిత బస్సు ప్రయాణం

బ్రహ్మోత్సవాలకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా వాహనాలను పార్కింగ్ ప్రదేశాలకు పంపుతాం. పార్కింగ్ ప్రదేశాల నుంచి దేవస్థానం ఈ ఏడాది 10బస్సులను ఏర్పాటు చేసి ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తుంది. భక్తులు ఆలయానికి చేరుకోవాలన్నా, లేక తమ వసతి గదులకు వెళ్లాలన్న, క్షేత్ర పరిధిలో ఆయా ప్రదేశాలకు ఉచితంగా చేరుకునేలా ఏర్పాటు చేసింది. ఉచిత బ్యాటరీ వాహనాలకు తోడు అదనంగా 10 బస్సులను కేటాయించింది.

గతంలో కంటే అదనంగా పార్కింగ్ ప్రదేశాలు



గత శివరాత్రి అనుభవాలను దృష్టిలో ఉంచుకుని గతంలో కంటే అదనంగా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశాం. క్షేత్ర పరిధిలో వివిధ చోట్ల కార్ల పార్కింగ్ కోసం 25 ఎకరాల్లో ఏర్పాటు చేశాం. అలాగే ఆర్టీసీ బస్సుల కోసం 14 ఎకరాల్లో పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశాం. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పార్కింగ్ ప్రదేశాల్లో ఏర్పాటు చేయడంతో పాటు వాహనదారులకు కావాల్సిన సౌకర్యాలను కల్పిస్తున్నాం. అంతేకాకుండా ఈ ఏడాది దేవస్థానం 10 ఉచిత బస్సులను ఏర్పాటు చేసి పార్కింగ్ ప్రదేశాల నుంచి ఆలయానికి ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం. – డి.పెద్దిరాజు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి



వాహనదారులు సేద తీరేందుకు ఏర్పాటు చేసిన షెడ్డు



పార్కింగ్ ప్రదేశాల్లో నూతనంగా నిర్మించిన శాశ్వత శౌచాలయాలు

సొంతింటి కలను సాకారం చేసిన జగనన్న



5వ వార్డులో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర దారా సుధీర్

నందికొట్కూరు: పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ అన్నారు. సోమవారం పట్టణంలోని 5వ వార్డులో కార్యకర్తల ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 4,969 మంది అర్హులను గుర్తించి స్థలంతో పాటు బిల్డింగ్‌లను సీఎం వైఎస్ జగనన్న మంజూరు చేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించి సీఎం జగనన్న చరిత్రలో నిలిచారన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు మన రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసేందుకు వస్తున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని స్పష్టం చేశారు. మాజీ సీఎం చంద్రబాబు మోసపూరిత మాయమాటలను నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు హమీద్, నాయబ్, లాలు, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు ఉస్మాన్‌బేగ్, అబుబక్కర్, పట్టణ అధ్యక్షులు మన్సూర్, స్థానిక నాయకులు అబ్దుల్లా, జబ్బార్, ఉపేంద్రారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



దేవదాయశాఖమంత్రి కొట్టు సత్యనారాయణకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈఓ పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరుగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ అధికారులు పలువురు ప్రముఖులకు పత్రికలను అందజేసి ఆహ్వానించారు. సోమవారం తాడెపల్లిల్లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టుసత్యనారాయణను కలిసి ఆహ్వానించారు. అలాగే నంద్యాలలో జిల్లా న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరావును, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎస్పీ రఘువీర్‌రెడ్డిలను ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి హరిదాసు, పర్యవేక్షకులు స్వాములు, అర్చకులు, వేదపండితులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. ప్రముఖులకు వేదపండితులు వేదాశీర్వచనంతో స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి



మాట్లాడుతున్న సర్పంచ్ రవియాదవ్

నందికొట్కూరు రూరల్ : బిజినవేముల గ్రామంలోని కొందరు వ్యక్తులు తనపై చేస్తున్న అసత్య ప్రచారాలను మానుకోవాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, బిజినవేముల గ్రామ సర్పంచ్ రవియాదవ్ అన్నారు. గ్రామంలో జల్‌జీవన్ పైపులైన్ పనుల్లో అవకతవకలు జరిగాయని వచ్చిన కథనాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సోమవారం మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలోని సచివాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో జల్‌జీవన్ పథకం కింద పైప్‌లైన్ పనులను 1.5 కిమీ చేశామని అబద్ధపు కథనాలు ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. ఈ పథకం కింద మొత్తం 6 కి.మీ మేర పైపులైన్ పనులను గ్రామంలో చేయించామన్నారు. గ్రామంలో నీటి సమస్య లేకుండా ఉండేందుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ పనులను చేసినట్లు స్పష్టం చేశారు. ఇంటింటికీ కుళాయిలను కూడా గ్రామస్తులే స్వచ్ఛందంగా బిగించుకున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న పాలనలో గ్రామంలో రూ.3.15 కోట్ల అభివృద్ధి పనులను చేశామని, గతంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ ఈవిధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని గుర్తు చేశారు. తప్పుడు ప్రచారాలను మానుకోకపోతే ప్రజలే తగిన గుణపాఠం చేబుతారని హెచ్చరించారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శివలింగం, బుడ్డన్న, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా బట్టీలు ధ్వంసం

ఆత్మకూరు: పట్టణంలోని సిద్ధాపురం గ్రామ సమీపంలో నల్లమల అటవీ పరిధిలో నాటుసారా స్థావరాలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సారా స్థావరాలు దాడులు చేసి 1000 లీటర్ల బెల్లం ఊట, 10లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశామన్నారు. సారా తయారు చేయడం, విక్రయించడం నేరమన్నారు. సారా తయారు చేసే వ్యక్తులపై పలు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

యువకుడిపై దాడి

మహానంది: స్థానిక పార్వతీపురం కాలనీకి చెందిన హోటల్ మురళిపై నంద్యాలకు చెందిన నలుగురు యువకులు దాడి చేసి గాయపరిచినట్లు మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మహానందిలోని గాజులపల్లె వైపు ఉన్న ఓ లాడ్జీని నిర్వహించుకుంటున్న విషయంలో ఆదివారం రాత్రి ఘర్షణ జరిగిందన్నారు. నంద్యాలకు చెందిన వికాస్, వినయ్, మరో ఇద్దరు కలిసి మురళిపై దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలైనట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

బంజార సంఘం నూతన కమిటీ ఎంపిక

ఆత్మకూరు: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం బంజారా సంఘం నూతన కమిటీని ఎంపిక చేశారు. సంఘం నంద్యాల జిల్లా గౌరవ సలహాదారులు బాలునాయక్ మాట్లాడుతూ నూతన సంఘం గిరిజనుల అభ్యున్నతి కోసం కృషి చేస్తుందన్నారు. నూతన కమిటీ మండల అధ్యక్షుడిగా నాగస్వామి, ఉపాధ్యక్షులుగా రమేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటశివ నాయక్, అదనపు కార్యదర్శులుగా దశరథ నాయక్, మల్లికార్జున నాయక్, కార్యవర్గ సభ్యులుగా రాంబాబు నాయక్, చిన్నరాముడు నాయక్, నాగరాజు నాయక్, తదితరులు ఎంపికయ్యారు.

28న కోఆర్డినేషన్ సమావేశం

మహానంది: శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఈనెల 21వ తేదీన మొదటి కో ఆర్డినేషన్ సమావేశం నంద్యాలలో నిర్వహించామని, మహానందిలో 28న రెండవ కోఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మహానందిలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై చర్చించే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు

మహానంది: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దని బండిఆత్మకూరు ఎంపీడీఓ విజయరావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ మొబైల్ అప్లికేషన్లను డౌన్‌లోడ్ చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లక్ష్యాలను అధిగమించడంలో విఫలం చెందితే షోకాజ్ నోటీసులు ఇస్తామన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని బీజేపీ శ్రీశైలం నియోజకవర్గ కన్వీనర్ మోమిన్ షబానా అన్నారు. మండలంలోని కరివేన గ్రామంలో సోమవారం ప్రజా పోరు యాత్ర కొనసాగించారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, ఆయూష్మాన్ భారత్ కార్డుతో పాటు వివిధ పథకాల గురించి వివరించారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు

- ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- తత్తూరులో సచివాలయం, మంచినీటి ట్యాంక్ ప్రారంభం
- మండ్లెంలో సీసీ రోడ్ల ప్రారంభోత్సవం
- తంగడంచలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, జూపాడుబంగ్లాలో ప్రైమరీ హెల్త్ సెంటర్ ప్రజలకు అంకితం



తత్తూరులో ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న సిద్ధార్థరెడ్డి, డాక్టర్ దారా సుధీర్

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నారని ఏపీ శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. సోమవారం జూపాడుబంగ్లా మండల పరిధిలో పూర్తయిన పలు అభివృద్ధి పనులను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్‌తో కలసి ప్రారంభించారు. తత్తూరులో రూ.43.50 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనం, మంచినీటి ట్యాంక్, మండ్లెంలో రూ, 40లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్డు, రూ. 44లక్షలు వెచ్చించి నిర్మించిన తంగడంచ వైఎస్సార్ హెల్త్ సెంటర్, రూ.17 లక్షలతో రైతు భరోసా కేంద్రం, మండల కేంద్రంలో రూ.1.80కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలు..

ప్రతి సచివాలయ పరిధిలో రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ కేంద్రం ద్వారా ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలు అందించడం జరుగుతోందని సిద్ధార్థరెడ్డి అన్నారు. టీడీపీ పాలనలో మూతపడే స్థితికి వచ్చిన పాఠశాలలను ముఖ్యమంత్రి జగనన్న నాడు–నేడు పేరుతో అభివృద్ధి చేసి విద్యా రంగానికి పెద్ద పీట వేశారని గుర్తు చేశారు. విద్య, వైద్యం ప్రజలకు ఉచితంగా అందిస్తున్నారని కోపంతో కార్పొరేట్ వ్యాపార సంస్థలు ఆయనను ఓడించాలని కుట్రలు పన్నుతున్నాయన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో పేదలకు ధనవంతుల యుద్ధం జరుగుతుందని స్పష్టం చేశారు. చంద్రబాబుకు బలం లేకనే పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారనే విషయం ప్రజలకు తెలిసిపోయిందని స్పష్టం చేశారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలి

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ దార సుధీర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా పని చేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సువర్ణమ్మ, జెడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి, కౌన్సిలర్లు, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, నాయబ్, పార్టీ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి తిరుమలేష్‌రెడ్డి, సర్పంచులు నాగిరెడ్డి, నాగార్జునరెడ్డి, ఈశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దినేష్, పుల్యాల నాగిరెడ్డి, మద్దిలేటి రెడ్డి, గోవింద్‌యాదవ్, నరసింహయాదవ్, తరుణ్‌కుమార్‌రెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు పెద్ద పీట

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్రైస్తవులకు పెద్ద పీట వేశారని ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని కేవీఆర్ గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి క్రైస్తవ సంఘాల సేవకుల సదస్సు నిర్వహించారు. ఇందులో డాక్టర్ దారా సుధీర్‌తో కలసి సేవకులను పరిచయం చేసుకున్నారు.వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని కోరుతూ సేవకులు ప్రార్థనలు చేశారు. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. క్రైస్తవుల హక్కుల సాధనకు జగనన్న ప్రభుత్వం ముందుంటుందని చెప్పారు. ఏపీ క్రిష్టియన్ మైనార్టీ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ జయకాంత్, నియోజకవర్గ క్రిష్టియన్ కమిటీ సభ్యులు ప్రభుదాస్, యోహాన్, ఇమ్మానియేల్, సత్యాలు తదితరులు పాల్గొన్నారు.

28న మండలంలో ముఖ్యనాయకులతో పరిచయం

పాములపాడు: ఈ నెల 28న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ మండలంలోని పలు గ్రామాలు పర్యటించనున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 28న ఉదయం నుంచే గ్రామాల్లో పర్యటన మొదలవుతుందని చెప్పారు. ఉదయం 6గంటలకు బానుముక్కల, 9 గంటలకు బానకచెర్ల, సాయంత్రం 4గంటలకు వేంపెంట గ్రామాల్లో పర్యటన ఉంటుందన్నారు.

గిట్టుబాటు ధర ప్రకటించాలి

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరను వెంటనే ప్రకటించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రజాక్, రాంనాయక్, రణధీర్, స్వామన్న తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

పగిడ్యాల: మార్చి 3న ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యాక్రమాన్ని విజయవంతం చేయాల ని వైద్యాధికారి మోహన్ పిలుపునిచ్చారు. సోమ వారం స్థానిక పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బంది, ఆశా లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలియో రహిత మండలంగా పగిడ్యాలను చేసేందుకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలన్నారు. 0–5 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ అనిల్‌కుమార్, సీహెచ్‌ఓ రామ గుర్రప్ప, పీహెచ్‌ఎం భాగ్యమ్మ పాల్గొన్నారు.

పోలియో మహమ్మారిని నిర్మూలించాలి

ఆత్మకూరు: పోలియో మహమ్మారిని నిర్మూలించాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పోలియోపై అవగాహన సదస్సు నిర్వహించారు. 100శాతం లక్ష్యాన్ని సాధించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. బైర్లూటి వైద్యాధికారులు గోపాల్, ఏఓ మోహన్ పాల్గొన్నారు.

మల్లన్నకు నృత్య నీరాజనం



నృత్యప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన అర్చన, బృందం వారు సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో గణేశ పంచరత్నము, శివాష్టకం, శంభో..భో..శంభో, కాలభైరవాష్టకం తదితర గీతాలకు, అష్టకాలకు ఆధ్య, సహస్ర, వైష్ణి, కృతి, మనస్వి, విజ్ఞ, తన్వీశ్రీ, సహస్ర ప్రణవి, అక్షర, స్నిగ్ధ తదితరులు నృత్యం చేశారు.

వైద్యాధికారులు, సిబ్బందికి నోటీసులు



ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న పీఓ రవీంద్రారెడ్డి

మహానంది: రికార్డులు సక్రమంగా నిర్వహించుకోలేకపోతే ఎలా అంటూ ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ బి.రవీంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బండిఆత్మకూరు మండలంలోని జి.లింగాపురంలోని సబ్ సెంటర్, నారాయణపురం ప్రైమరీ హెల్త్ సెంటర్లలో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లింగాపురం సబ్‌సెంటర్‌లో రికార్డులు సరిగా మెయింటైన్ చేయని విషయాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బందికి సంజాయిషీ కోరుతూ నోటీసులు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉన్న చెంచు గూడేలలో యుద్ధ ప్రాతిపదికన మెడికల్ క్యాంపులు నిర్వహించి సికెల్ సెల్ అనీమియా టెస్టులు నిర్వహించి, వారిలో రక్తహీనత, దీర్ఘ కాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. ప్రతి చెంచు గూడెంలో చెంచు ప్రజలకు అందరికీ ఆరోగ్యశ్రీ కార్డ్, ఆయుష్మాన్ భారత్ కార్డ్, ఆరోగ్య బీమాలు అందేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట ఐటీడీఏ ప్రాజెక్ట్ మేనేజర్ కే.జి.నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల సాధనకు ఉద్యమించాలి

నందికొట్కూరు: దివ్యాంగుల హక్కుల సాధన కోసం ఉద్యమించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు మల్‌రెడ్డి నాగన్న పిలుపునిచ్చారు. దివ్యాంగులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం పట్టణంలోని దివ్యాంగుల కార్యాలయం నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి మహాధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర్, కోశాధికారి శేషమ్మ, సభ్యులు సరస్వతి, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

92.55 శాతం కులగణన పూర్తి

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో కుల గణన సర్వే 92.55 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ జవహర్ బాబు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో 11 గ్రామ సచివాలయాలు ఉండగా అందులోని గ్రామాలలో 10,616 కుటుంబాలు ఉండగా 9,824 కుటుంబాలకు గ్రామవలంటీర్లు కులగణన సర్వే పూర్తి చేశారన్నారు. అదేవిధంగా జగనన్న ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ 86.92 శాతం పూర్తి అయ్యిందని చెప్పారు. జగనన్న ఇళ్లపట్టాలు మండలంలో 918 మంది లబ్ధిదారులు ఉండగా అందులో 798 మంది రిజిస్ట్రేషన్ పూర్తి అయిందని, ఇంకా 120 మందివి చేయాల్సి ఉందని తెలిపారు.